వర్షం జోరుగా పడుతున్నది. జివ్వుమని ఈదురుగాలి వరాల్ని కరిచేస్తున్నది. చుట్టూ ఎటు చూసినా చీకటి తప్ప ఇంకేమీ కనిపించడం లేదు.

పరిచయమైన మార్గమే. కాబట్టి బాకుల్లా ముఖంమీద పడుతున్న వర్షపుధారల్ని, నరాలు కొరికేస్తున్న ఈదురుగాలిని లెక్కచేయకుండా ప్రకాశం సైకిలు తొక్కుతున్నాడు.

బాట ఎగుడు దిగుడులతోను, గుంతలతోను ఉండటంవల్ల మామూలప్పుడే సైకిలు తొక్కడం కష్టం. ఈ వర్షంలో, చీకట్లో బాటంతా జలమయం కావడంవల్ల సైకిలు ఎంత వేగంగా తొక్కుదామన్నా సాధ్యం కావడంలేదు.

తాలూకాలో మందులు కొని ఇ యిఋదేరిన సమయు




వచ్చిన దూరం సుమారుగా లెక్క వేసుకొని 'అబ్బ! ఇంకా నాలుగు మైళ్ళు పోవాలి. . . ఈ వర్షానికి రాళ్ళవాగు బాగా పొంగిఉంటుంది. వాగు దాటడం ఎలాగో యేమో. . .' అనుకొంటూ శక్తినంతా కూడగట్టుకొని సైకిలు తొక్కుతున్నాడు ప్రకాశం.

కొంతదూరం వచ్చేప్పటికి ముందుచక్రం నీళ్ళు నిండిన గోతిలోకి దిగబడింది. ప్రకాశం తూలి పడబోతున్న వాడల్లా నిలదొక్కుకొని, రెండు చేతుల తోను బలంగా ముందు చక్రాన్ని పైకిలాగి, ఆయాసంతో సైకిలు ఎక్కలేక కొన్ని క్షణాలు అలాగే నిలబడి పోయాడు.

పైన జోరున వర్షం, కిందంతా జలాజంత్రం. పైగా ఈదురుగాలి, చీకటి. మనిషి ముద్దయిపోవడంవల్ల ఒణుకేసుకొస్తున్నది. కాస్త వెచ్చదనం కోసం సిగరెట్ కాలుద్దామనుకున్నా తడిసిపోవడంవల్ల సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె అంతకుముందే పారేశాడు. కొంత దూరం సైకిలు నడిపించుకుంటూ వచ్చాడు. అదీ కష్టమే అని పించి మళ్ళీ సైకిలు ఎక్కాడు.

# మృత్యువు నవ్విన రాత్రి

సింగరాజు లింగమూర్తి

**ఒకరికోసం వచ్చిన మృత్యుదేవత మరొకరిని తీసుకుపోవడం అసహజం కాదు. కాని తనను ద్వేషించే ఒక వ్యక్తికోసం, తాను ఆరాధించే మరొక వ్యక్తి కారణంగా ప్రాణార్పణం చేయడం మహోత్తమచర్య కావచ్చు. అంత మంచితనం మనుషులలో ఇంకా ఉన్నందుకు మృత్యువు నవ్వుకుంటుంది.**

ఆకాశం ఉరిమింది. ఫెళఫెళమంటూ ఎక్కడో పిడుగు పడింది. కళ్ళు జిగేలుమనిపించేట్టు మెరుపు దూసుకు వచ్చింది. ఆ వెలుగులో కాస్త దూరంగా ఊరు కనిపించింది.

'ఈ రాత్రికి వందిపాడులో ఆగిపోతే?. . . ఊహుఁ. . . అంతా నా కోసమే ఎదురు చూస్తుంటారు. ఇంకొకళ్ళ సంగతి ఎట్లా ఉన్నా పార్వతమ్మగారి సంగతో?. . . ఊహుఁ, ఎక్కడా ఆగడానికి వీల్లేదు. వెళ్లాలి. నరసింహంగారు బ్రతకాలి. పార్వతమ్మగారి కళ్ళల్లో సంతోషం చూడాలి' అనుకుంటూ సైకిలు తొక్కుతున్నాడు.

వర్షం కాస్త తగ్గినట్టే తగ్గి మళ్లీ జయ్యిన ప్రారంభమైంది.

వళ్లబిగువుమీద సైకిలు తొక్కుతున్నాడు ప్రకాశం. వందిపాడు దాటాడు. అక్కడినుంచి అంతా డొంక. డొంక దాటితేగాని వాగు రాదు. వాగు దాటితే రామవరం చేరినట్టే. వాగుకీ ఊరికీ అరమైలుంటుంది.

ప్రకాశం కళ్లముందు రామవరం, నరసింహంగారి ఇంటిలో ఆయన గది తప్ప ఇంకేమీ కనిపించడం లేదు.

నరసింహంగారు అపస్మారంలో మంచంమీద పడున్నారు. కాళ్లకట్టున మంచానికి దగ్గిరగా పార్వతమ్మగారు స్టూలుమీద దైన్యంగా కూర్చుని ఉంది. కూతురు సరోజ కింద చతికిలబడి, గోడ కానుకొని తండ్రి మంచంవైపు ఆందోళనగా చూస్తున్నది. డాక్టర్ గదిలో పచార్లు చేస్తూ మధ్య మధ్య నరసింహంగారిని పరిశీలిస్తున్నాడు.

ఆ రోజు సాయంత్రం స్కూలు వదిలిన తరవాత నరసింహంగారికి ప్రమాదంగా ఉందని తెలిసి, హెడ్మాస్టరు, తోటి ఉపాధ్యాయుడితో కలిసి ప్రకాశం నరసింహంగారింటికి వెళ్లాడు.

ఆయనను చూడటానికి వచ్చిన ఊళ్లోవాళ్లు కొందరు బయటి అరుగులమీద నిలబడ్డారు. అందులో ఒకరిని ఉద్దేశించి "ఎలా ఉంది ప్రెసిడెంటుగారికి" అని హెడ్మాస్టరు ప్రశ్నించాడు.

"టపా కట్టేట్టున్నాడు. చేసిన పాపాలు, అన్యాయాలు ఊరికే పోతాయా? కుటుంబాన్ని కట్టి కుడుపూ? ఎదిగి వస్తున్న కొడుకు దిక్కూ మొక్కూ లేకుండా అలా పట్నంలో చచ్చాడు! ఖర్మ ఓయన. . ." అన్నాడా పెద్దమనిషి.

'ఛీ! ఛీ! ఏం మనుషులు! తోటివాడు లోపల చావుబ్రతుకుల్లో ఉంటే ఇట్లా మాట్లాడటానికి నోరెట్లా వస్తున్నదో?' అనుకున్నాడు ప్రకాశం.

"తాలూకాకు వెళ్లి ఎవరైనా ఇంజక్షనులు తెస్తే బతుకుతాడంటున్నాడు డాక్టరు." ఇంకొకతను అన్నాడు.

"ఈయన బతక్కపోతే భూమికి వెలితేమిటంట?" ఇంకో డందుకున్నాడు.

ఇక అక్కడ నిలబడలేకపోయాడు ప్రకాశం. 'ఆయ నెంత దుర్మార్గుడైతే మటుకు ఇటువంటి ఆపదసమయంలోనా సాధించడం?' అనుకున్నాడు.

"నా దగ్గిర రెండు ఇంజక్షనులుంటే ఇచ్చాను. రాత్రి పన్నెండు గంటల లోపల ఇంకో రెండిస్తేగాని ఈయన తేరుకోరు. ఈ రాత్రి గడవడం కష్టం. . ." హెడ్మాస్టరుతో అన్నాడు డాక్టరు.

"అంతా చూడటానికి వచ్చినవారేగాని వెళ్లి తెస్తా మన్నవారు లేరు. . ." అంది సరోజ.

"మధ్యాహ్నం నుంచి ఒకటే వర్షమయ్యె. . . అందుకని సందేహిస్తున్నారేమో!" అన్నాడు హెడ్మాస్టరు.

పార్వతమ్మగారు ప్రకాశంవైపు చూసింది. కలకల లాడే ఆమె ముఖంలో భయాందోళనలు, కళ్లల్లో దైన్యం చూసేప్పటికి ప్రకాశం మనస్సు విలవిల లాడిపోయింది. "మీరు భయపడకండి. ఎవరి సైకిలైనా తీసుకొని నేను తాలూకాకు వెళ్లి తెస్తాను" అన్నాడు.

"నివా!. . ." విస్మయంగా అంది పార్వతమ్మగారు.

"నాలుగు రోజులనుంచి నుస్తీగా ఉంటున్నావయ్యె. వెళ్లి రాగలరా?" అన్నాడు హెడ్మాస్టరు.

"మరేం ఫర్వాలేదు. . ."

డాక్టర్ రాసిచ్చిన కాగితం, డబ్బు పుచ్చుకుని హెడ్మాస్టారి సైకిలు తీసుకొని బయలుదేరుతూ ఉంటే "రాత్రి పది గంటలకల్లా వచ్చేయాలి సుమా!" అని హెచ్చరించాడు డాక్టరు. 'సరే' నన్నట్టు తల ఊపి సైకిలెక్కాడు ప్రకాశం. 'పెద్ద మొనగాడు బయలు దేరాడయ్యా!' అనుకున్నారు అరుగుమీదివాళ్లు.

ఆ సంఘటనే ప్రకాశం స్మృతిపథంలో కదులు తున్నది. పార్వతమ్మగారి కళ్లల్లోని దైన్యమే అతనికి జ్ఞాపకం వస్తున్నది.

'ఎంత చల్లటితల్లి పార్వతమ్మగారు. . . నరసింహంగారేమైనా అయితే ఆమె ఆ దుఃఖాన్ని భరించగలదా? అసలే కడుపుశోకంతో ఉన్నదయ్యె!' అనుకున్నాడు.

ప్రకాశం ఉపాధ్యాయుడుగా రామవరం సమితి స్కూలుకు వచ్చిన తొలి రోజ లవి.

ప్రెసిడెంటు నరసింహంగారంటే ఊళ్లోవాళ్లకు గౌరవంకంటే భయమే ఎక్కువ. అసహ్యించుకుంటారు కూడా. కాని ఎదట ఏమీ అనలేరు. ఆయనవల్ల ఊరు బాగుపడటమేమోగాని, ఐక్యంగాఉన్న కుటుంబా లలో కలత లేర్పడ్డాయి. కొన్ని కుటుంబాలు దుంప నాశనమయ్యాయి. ఆయనంటే ఎంత హడలిపోతారో, ఎంత అసహ్యించుకుంటారో ఆయన భార్య పార్వతమ్మ గారంటే అంత గౌరవిస్తారు. ఆయ నెంత కఠినుడో, ఈమె అంత కరుణామయి. ఊళ్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆమె సహాయం పొందనివారు లేరు.

ప్రకాశం వచ్చినరోజు స్కూల్లోనే గడిపాడు. హెడ్మాస్టరు, తోటి ఉపాధ్యాయుడు చెప్పిన ప్రకారం నరసింహంగారి దర్శనానికి వెళ్లాడుగాని ఆయన ఊళ్లో లేడని నౌకరు వీథిలోంచే పంపించేశాడు.

"మా ఇళ్లలో భోజనం చేయరే, మరెట్లా?" హెడ్మాస్టరు, తోటి ఉపాధ్యాయుడూ అన్నారు.

"సామాను తెచ్చుకున్నాగా. స్కూల్లోనే వంట చేసుకుంటా" అన్నాడు ప్రకాశం.

కాని, అతనికి స్కూల్లో వంట చేసుకోడానికి బుద్ధి పుట్టలా, పరిసరాలు చూసేప్పటికి.

'ఏమిటిది! ప్రెసిడెంటుగారు చెప్పందే ఎవరూ గది ఇవ్వరా? రెడ్డిగారు వాళ్ల ఇంట్లో గది ఇస్తానురమ్మంటే, "ఆయన ఎదటి పార్టీమనిషి, అక్కడికి వెడితే ప్రెసిడెంటుగారు నీకు పుట్టగతులు లేకుండా చేస్తారు!" అన్నాడయ్యో హెడ్మాస్టరు.

ఎటూ పాలుపోక, ఆ రాత్రి ఒక విద్యార్థిచేత పాలు తెప్పించుకు తాగి, స్కూల్లోనే పడుకున్నాడు.

మరునాడు లేచేప్పటికి ప్రకాశానికి బాగా ఆకలి వేసింది. ఒళ్లంతా నీరసంగా అనిపించింది. అతని వాలకం చూసి "ప్రెసిడెంటుగో రింక రానేదంట. మా రెల్లి అమ్మగోర్ని కలవండి, సార్! ఆమె శాన మంచోరు" అన్నాడు స్కూలుబంట్రోతు.

మధ్యాహ్నం స్కూలు వదిలాక ప్రకాశం నరసింహంగారింటికి వెళ్లాడు.

"ఓరయ్యోయ్, కొత్తమడిసివి సరాసరి లోపలికి వొస్తున్నావ్! ప్రెసిడెంటుగోరు లేరని తెల్దేంటి?" అన్నాడు పాలేరు.

"అమ్మగారితో చెప్పు, స్కూలునుంచి కొత్త పంతులుగారు వచ్చారని. . . ." అన్నాడు ప్రకాశం.

ఇంతలో ఏ పనిమీదో అటు వచ్చిన పార్వతమ్మగారు "ఎవరూ?" అంది.

ప్రకాశం ఆమెవైపు చూశాడు. లక్ష్మీదేవిలా కలకల లాడుతున్న వర్చస్సుతో, కరుణ ఉట్టిపడుతున్న కనుదోయితో మాతృమూర్తిలా తోచి అప్రయత్నంగానే చేతులు జోడించాడు.

"ఊరికి కొత్తవాడివిలా ఉన్నావు. ఏ ఊరు, బాబూ!" సాదరంగా ప్రశ్నించిం దామె.

ప్రకాశం తన సంగతి అంతా చెప్పుకున్నాడు.

"అయ్యయ్యో, నిన్నంతా ఉపాసమే!. . . ఈ వాటి

మిత్రాళ్లకు మహా అభిమానం, సిగ్గూను. ఆయనగారు లేకపోతేనేం, వస్తే భోజనం పెట్టకపోయేదాన్నా! పాటివాడివి, నిన్ననంతా వస్తే అంటే ఏడుపు తరుక్కుపోతున్నది. . . తిరపతయ్యా, బాబుకు చెంబుతో నీళ్లు తెచ్చియ్యి. . ." అంది పార్వతమ్మగారు.

అతను భోజనం చేస్తూంటే పార్వతమ్మగారు దగ్గరే ఉండి, అతను మొహమాట పడుతుంటే అన్నీ మారువడ్డించి భోజనం చేయించింది.

సవతి తల్లిచేతి తిండికి అలవాటు పడిన ప్రకాశానికి తల్లి జ్ఞాపకం వచ్చింది.

'అమ్మ ఇలాగే అన్నీ అడిగడిగి వేసి తినిపించేది. . . అమ్మ బ్రతికుంటే సరిగ్గా ఇలాగే ఇదే వయస్సులో ఉండేదేమో!' అనుకునేప్పటికి ప్రకాశం కళ్లు చెమర్చాయి.

'కొడుక్కి చేతిమీదుగా అన్నం పెట్టుకొని తృప్తిపడే ప్రాప్తం లేకపోయిందిగదా! రఘుకు ఇతని వయస్సే ఉండేదిగా బ్రతికుంటే. . .' అనుకునేప్పటికి పార్వతమ్మగారి కళ్లల్లో నీళ్లు నిండాయి.

ప్రకాశం చెయ్యి కడుక్కొని ఇవతలకు వస్తుంటే "పావిట్లో ఉయ్యాలబల్లమీద కాసేపు విశ్రాంతి తీసుకో, బాబూ!" అంది పార్వతమ్మగారు, పమిటతో కళ్లొత్తుకుంటూ.

ఆలోచనలతో సైకిలు తొక్కుతున్న ప్రకాశానికి ఎదుట ఏమున్నదీ కనిపించడం లేదు.

వర్షం పడుతూనే ఉంది. ఈదురుగాలి కొడుతూనే ఉంది. హేండిల్‌బార్‌మీద ఉన్న వేళ్లు కొంకర్లు పోతున్నాయి.

ఆ చీకట్లో, వర్షంలో కనిపించలేదేమో ముందు చక్రం ఏ రాయికో గుద్దుకున్నట్టుంది. ప్రకాశం కింద పడిపోయాడు. ఆ పడటంలో తల రాయికి తగిలిందేమో 'అమ్మా!' అనుకున్నాడు.

కొన్ని నిమిషాలు లేవలేక, అశక్తతతో అలాగే ఉండిపోయాడు. చేత్తో తల తడుముకున్నాడు. 'నెత్తురు వస్తూన్నట్టుంది. దెబ్బ బాగా తగిలిందేమో!' అనుకున్నాడు.

'నా కెందుకీ శ్రమ?. . . ఒక దుష్టుణ్ని బ్రతికించవలసిన అవసరం నాకేమిటి? తల్లిలాంటి పార్వతమ్మగారినీ, నన్నూ అనుమానించి దుర్భాషలాడిన నరసింహంగారు, ప్రజలను మభ్యపరిచి, భంగపరిచి పీడించుకుతినే ప్రెసిడెంటు బ్రతక్కపోతే భూమికి వచ్చిన వెలితేమిటి?' అని ఆవేశపడ్డాడు. కాని అతనిలో ఆ భావం ఎక్కువసేపు నిలవలా, ఆ సాయంత్రం పార్వతమ్మగారిలో చూసిన దైన్యం జ్ఞాపకం వచ్చేప్పటికి.

'ఏమిటిది! వాళ్లలాగే నేనూ ఆలోచిస్తున్నాను? విసుగు, అలసటవల్ల ఇలా ఆలోచిస్తున్నానా? ఆయన ఎటువంటివాడైతేనేం? పార్వతమ్మగారు ఉత్తమ ఇల్లాలు. ఆ పవిత్రమూర్తి కోసం, ఆమె పసుపు కుంకుమ ఇంకో పదేళ్లపాటు నిలిచేందుకు ఈ మాత్రం శ్రమ పడలేనా? నరసింహంగారు బ్రతికితే చాలు' అన్న నిశ్చయానికి వచ్చాడు.

ఓపిక కూడదీసుకొని, లేచి పక్కనే పడున్న సైకిలు లేవనెత్తి మళ్లీ బయలుదేరాడు.

ప్రకాశం ఆలోచనల్లో మళ్లీ వెనక జరిగిన సంఘటనలు కదిలాయి.

ఆ రోజు పార్వతమ్మగారి చేతి భోజనం చేసి ఉయ్యాలబల్లమీద కూర్చుని ఉండగా, నరసింహంగారు టాక్సీలోంచి దిగి లోపలికి వచ్చారు. వినయంగా చేతులు జోడించిన ప్రకాశం కళ్లల్లోకి తీక్ష్ణంగా చూస్తూ "ఎవరు నీవు?" అని ప్రశ్నించారు.

ప్రకాశం నమ్రతగా తనను పరిచయం చేసుకున్నాడు.

ఆయన కంఠం విని, అక్కడకు వచ్చిన పార్వతమ్మగారు "మీరు ఊళ్లోలేరని తెలిసి స్కూల్లోనే ఉండిపోయాట్ట. పాపం, నిన్నంతా ఉపాసమే. ఇప్పుడే పట్టెడన్నం పెట్టి కూర్చోపెట్టా" అంది.

"ఊఁ. . ." అన్నా రాయన. ఆ స్వరంలో కటుత్వమే ధ్వనించినట్లనిపించింది ప్రకాశానికి.

"మీ రెక్కడైనా గది ఇప్పిస్తే రాత్రినుంచి వంట చేసుకుంటా. . ." అన్నాడు.

"ఊఁ. . . సాయంత్రం కనపడు" అని నరసింహంగారు లోపలకు వెళ్లిపోయారు.

"వెళ్లొస్తానండీ..." అంటూ ప్రకాశం కృతజ్ఞతగా పార్వతమ్మగారికి నమస్కరించాడు.

"అప్పుడప్పుడు వచ్చి కనిపిస్తూండు, బాబూ!" అని వీధిగుమ్మం వరకూ వచ్చి సాగనంపింది.

ఒకసారి ప్రకాశానికి జ్వరం వచ్చి నాలుగు రోజులు సెలవు పెట్టి గదిలోనే ఉండిపోయాడు. స్కూలు బంట్రోతువల్ల తెలుసుకొని 'అయ్యో, పాపం! ఒంటరి వాడు. ఎలా ఉన్నాడో, ఏమో' ననుకొని పార్వతమ్మగారు ఆ సాయంత్రం అతని గదికి వెళ్లి పరామర్శించింది.

"ఇవ్వాళే జ్వరం రాలేదు, పిన్నిగారూ!" అన్నాడు ప్రకాశం.

"భలేవాడివే, ఒంటరిగా జ్వరంతో ఇక్కడ పడి ఉండకపోతే మా ఇంటికి వచ్చెయ్యక పోయావా, బాబూ! రేపుకూడా జ్వరం రాకపోతే ఎల్లుండి పథ్యం చేసి పెడతా, నాతో వచ్చేసెయ్యి మా ఇంటికి" అం దామె.

"మీ కెందుకులే శ్రమ, పిన్నిగారూ!"

"బాగుంది. ఇందులో పెద్ద శ్రమేముంది. మా రఘు ఉన్నట్లయితే చేసేదాన్నికాదూ!" అంటూనే బలవంతంచేసి అతణ్ణి ఇంటికి తీసుకుపోయింది.

నరసింహంగారు అప్పుడూ ఊళ్లో లేరు. తాలూకా ఊళ్లో ప్రియురాలి దగ్గిర వారంలో మూడు రోజులు గడపడం ఆయనకు అలవాటు. ఆయన వచ్చేప్పటికి ప్రకాశం రెండు పథ్యాలు పుచ్చుకున్నాడు.

"నేను లేనుగదా, పరాయివాణ్ణి ఇంట్లో తెచ్చి పెట్టుకుంటానికి సిగ్గెట్లా లేకపోయింది?" అని పార్వతమ్మగారిమీద విసుక్కున్నారు నరసింహంగారు.

"ఇందులో సిగ్గుపడవలసిందేముంది? పాటివాడు జ్వరం వచ్చి పడున్నాడు గదా అని తీసుకువచ్చి పథ్యం పెట్టాను. తప్పేముంది?"

"నీకు తప్పుగా తోచకపోవచ్చు. చూసేవాళ్లకు ఏమనిపిస్తుందో ఆలోచించవేం? మొగుడు ఊళ్లో లేని సమయంలో పరాయిమగవాణ్ణి ఛీ. . ." అన్నా రాయన.

"ఇలా అనడానికి మీకు నోరెట్లా వచ్చింది? అవును లెండి. ఎవరు ఏ నడతలో ఉంటే, అందరూ అదే నడతలో ఉంటారని ఊహిస్తారు." ఆమె చెప్పదలచుకున్నది పూర్తికాకుండానే "చాల్లే, నోర్ముయ్" అన్నారు నరసింహంగారు.


"నోరు మూసుకొని ఉండబట్టే మీ ఆటలన్నీ సాగుతున్నాయి. నావయస్సేమిటి, అతని వయస్సేమిటి? నాకు రఘు ఎంతో ప్రకాశమూ అంతే. రఘు బ్రతికి ఉంటే ఇంతవాడయ్యేవాడు కదూ!" అని అంటూంటే ఆమె కళ్లల్లో నీళ్లు నిండాయి.

ఇంకేమీ మాట్లాడలేకపోయారు నరసింహంగారు.

రఘు పట్నంలో కాలేజీలో చదువుతున్న రోజుల్లో తోటి విద్యార్థులతో కలిసి ఎక్స్‌కర్షన్‌కు వెళ్లినప్పుడు

"పక్కింటాయన అప్పు తీర్చేస్తే పోయిందిగా, రోజూ ఎందుకీ అవస్థ!"

చిత్రం—ఎస్. శంకర్ (విజయవాడ-2)



ఆక్సిడెంటువల్ల మరణించాడు. అప్పుడతనికి పదిహేడేళ్ళు. పార్వతమ్మగారు భీరువు. గుండెనిబ్బరం లేనిదై నట్లయితే ఎదిగివస్తూన్న కొడుకు అకస్మాత్తుగా పోయినందుకు మంచమెక్కేదే. కూతురిలోనే కొడుకును చూసుకొని, ఆ విచారంనుంచి తట్టుకోగలిగింది. సరోజకు పెళ్లి అయి, అత్తగారింటికి వెళ్లిపోయినప్పటినుంచి ఆమెకు ఏమీ తోచేదికాదు. సరోజ ఏడవ నెలలో పురిటికి వచ్చి, పిల్లాడికి మూడో నెల వెళ్లేవరకు ఉండిపోవడం వల్ల ఆమెకు బాగా కాలక్షేపమే అయింది. ఆమె వెళ్లిపోయిన పది రోజులకే ప్రకాశం ఆ ఊరు రావడంవల్ల, అతనిలో రఘును పోల్చుకొని, మనస్సుకు ఊరట కలిగించుకునేది.

ప్రకాశం ఇరవై రెండేళ్ల ప్రాయంలో ముచ్చటగా ఉంటాడు. అతణ్ణి చూస్తూంటే, 'ఈ అయిదేళ్లలో రఘు ఇలాగే ఎదిగి ఉండేవాడు కదా!' అనుకునేది పార్వతమ్మగారు. అందుకే ఆమె ప్రకాశంపట్ల ఆదరాభిమానాలు చూపేది.

'అమ్మయ్య! వాగు వచ్చేసింది. . .' అనుకుంటూ సైకిలు దిగాడు ప్రకాశం. బయ్యిన రొద చేస్తూ వెల్లువలై పారుతున్న వాగును చూసేప్పటికి గుండె జారిపోయిం దతనికి.

'ఎట్లా వాగు దాటడం?. . . వాగు తీసిందాకా ఆగితే అవతల నరసింహంగారు ఏమౌతారో?' అనుకుంటూ నిలబడిపోయాడు.

వర్షం జోరు తగ్గి సనసన్నగా పడుతున్నది. గాఢాంధకారంలో ఎదురుగా నురుగులు గక్కుతున్న వాగు కబళిస్తూన్నట్లుగా ఉంది.

ఎనిమిది మైళ్ళు కుంభవృష్టిలో సైకిలుమీద వచ్చేప్పటికి అతనిలో శక్తి తగ్గిపోయింది. చలితో వణికిపోతున్నాడు. ఆకలి కలచి వేస్తూన్నది. వాగు దాటడానికి అధైర్యం. వెళ్లకపోతే అంతవరకు పడిన శ్రమ వృథా అయిపోతుందేమోనన్న విచారం, పార్వతమ్మగారిని ఏ స్థితిలో చూడవలసి వస్తుందో అన్న బెంగ అతనిలో పెనవేసుకు పోయాయి. అతని కళ్లల్లోకి పార్వతమ్మగారు దైన్యంగా చూస్తున్నట్లనిపించింది.

'బాధ్యత నెత్తిమీద వేసుకు బయలుదేరాను. నా కర్తవ్యం నెరవేర్చుకుంటాను. అదృష్టం ఉంటే నరసింహంగారు బ్రతకవచ్చు' అనుకొని సైకిలు ఒడ్డునే వదిలేశాడు. ప్లాస్టిక్ బాగును పైజామా బొందుతో నడుముకు కట్టుకొని వాగులోకి దిగాడు.

సనసన్నగా వర్షం పడుతున్నది. ప్రవాహపు వేగం అతణ్ణి నెట్టివేస్తున్నది. వాగు మధ్యలోంచి ఈదుకుంటూపోతే రాళ్ళు తగలవు. అది గుర్తు చేసుకుంటూ ప్రకాశం ఈదుతున్నాడు. ఎదురుగాలి అతణ్ణి ఇబ్బంది పెడుతున్నది. ప్రవాహపు ఒరవడి అతణ్ణి అడ్డంగా నెట్టివేస్తున్నది. 'ఏటికి ఎదురీదడమంటే ఇదేనేమో' అనుకున్నాడు. ప్రవాహానికి కొట్టుకువస్తూన్న కంప అతణ్ణి చుట్టుకుంది. ఏ దుంగో వచ్చి అతణ్ణి బలంగా ఢీకొంది.

ఎంతో ప్రయాసతో ప్రకాశం అరగంటలో ఒడ్డుకు చేరి 'అమ్మయ్య!' అనుకుంటూ ఆయాసంతో కూలబడ్డాడు. వాగులో ఈదుతున్నప్పుడేమీ అనిపించలేదు గాని ఒడ్డు చేరేప్పటికి ఈదురుగాలికి ఒణుకేసుకు వచ్చింది. ఒళ్లంతా ముళ్లు గుచ్చుకున్నాయేమో బాధగా ఉంది. నడుద్దామని లేచి నిలబడ్డాడు. కాళ్లు బండబారినట్లయి, తల తిరుగుతున్నట్లనిపించి మళ్లీ కూలబడ్డాడు. 'ఏమిటో, ఎట్లాగో అయిపోతున్నా' అనుకున్నాడు. ఇంతలో "ప్రకాశం బాబుగోరూ" అన్న కంఠం వినిపించింది. 'ఊఁ' అని మూలిగాడు. గోనెసంచీ తలమీదుగా కప్పుకొని, చుట్ట పొగ వదులుతూ హరికెన్‌లాంతరు పుచ్చుకున్న తిరపతయ్య "అందరూ మీ కోసమే ఎదురు సూస్తాండారు. అమ్మగోరు బండి తీసుకెళ్లి ఒడ్డునే కాసుకు ఉండమన్నారు. లెగండి, బాబూ, బండెక్కుదురుగాని" అన్నాడు.

ప్రకాశం ఏదో చెబుదామనుకున్నాడు. గొంతులోంచి వస్తూన్న వణుకు, ఆయాసం, నీరసం వల్లనేమో మాట పెగిలి రాలేదు. లేచి నిలుచుని పడిపోబోతుంటే తిరపతయ్య పట్టుకొని, భుజంమీద వేసుకొని వెళ్లి బండిలోకి ఎక్కించాడు. తాను ముందు తొట్టెలో కూర్చుని గిత్తల్ని అదలించాడు.

మరో అరగంటలో బండి నరసింహంగారింటి ముందాగింది. ఆ చప్పుడుకు ఇంట్లోవాళ్ళు, ఇరుగు పొరుగువారు బయటకు వచ్చారు. తిరపతయ్య దిగి వచ్చి, "ఒరేయ్, మల్లేశం! ప్రకాశంబాబుగోరిని లోపలికెత్తుకెల్దాం రారా!" అని కేకేశాడు.

వాళ్లిద్దరూ ప్రకాశాన్ని సావిట్లోకి తెచ్చి ఉయ్యాల బల్లమీద పడుకోబెట్టారు. నరసింహంగారి గదిలోంచి డాక్టర్ వచ్చి "ఏమైంది?" అన్నాడు.

"శానా అలిసిపోయిండు, సార్!" అన్నాడు తిరపతయ్య.

ప్రకాశాన్ని ఆ అవస్థలో చూసేప్పటికి పార్వతమ్మగారి హృదయం తరుక్కుపోయింది. "తిరపతయ్యా, బాబుకు పొడిబట్టలు వేసి తల శుభ్రంగా తుడు. లోపలినుంచి శాలువ తెచ్చి కప్పు" అంది.

డాక్టర్ ప్రకాశం నడుముకు బిగించి కట్టిన ప్లాస్టిక్‌బాగ్ తీసి, అందులోంచి ఇంజక్షన్‌పాకెట్, మందు సీసా తీసుకొని, చరచరా నరసింహంగారి గదిలోకి వెడుతూంటే పార్వతమ్మగారుకూడా వెళ్లింది.

క్షణాలు, నిమిషాలు బరువుగా గడుస్తున్నాయి. నరసింహంగారి పల్సు చూస్తూ, ఆయన ముఖంలోని మార్పులు పరిశీలిస్తున్నాడు డాక్టరు. పార్వతమ్మగారు, సరోజ ఆయన వంక ఆందోళనగా చూస్తున్నారు.

గంట దాటింది. మృత్యుముఖంలోంచి తప్పించుకొని నరసింహంగారు కళ్లు తెరిచారు. పార్వతమ్మగారి ముఖంలో ఆనందం విరిసింది. సంతోషంతో కళ్లు మెరిశాయి.

"అమ్మగోరూ, ప్రకాశంబాబుగోరు పోయారమ్మగోరూ..." సావిట్లోంచి తిరపతయ్య పెట్టిన గావుకేక పార్వతమ్మగారి హృదయానికి అశనిపాతమైంది. ఆదుర్దాగా గదిలోంచి వచ్చి ప్రకాశాన్ని చూస్తూ స్థాణువులా నిలబడిపోయింది.

ఏ మాతృమూర్తి కళ్లల్లో సంతోషం మెరిస్తే చూడాలని అంత పాటుపడ్డాడో, తీరా అది చూడటానికి తానే లేకపోయాడు ప్రకాశం! ★

